# బామ్మర్దిగారి రథయాత్ర

సాయంకాలం ఆరునుంచి రాత్రి పన్నెండు దాకా క్లబ్బులో పేకాడి, 'గుర్రవెక్కి' వేటకి రోడ్డుమీద కొచ్చారు కోటయ్య మంత్రిగారి బామ్మర్ది పిచ్చయ్యగారు. క్లబ్బు గేటు దగ్గర రోడ్డుమీద నిలబడ్డ బామ్మర్దిగారికి, ఈ రోజు తను లేళ్ళను, కుందేళ్ళను కాకుండా మనుషుల్ని తినేసే పులిని వేటాడ్డానికి వెడుతున్నాననీ, అది తనను తినేస్తుందనీ ఆ క్షణంలో పాపం తెలియదు.

గేటులోంచి బయటకు వచ్చి ఓ క్షణం కళ్ళు నులుముకుని రోడ్డుకేసే చూస్తూ ఉండిపోయారు బామ్మర్దిగారు. 'మనం లోపలికెళ్ళేప్పుడు ఓ రోడ్డే ఉంది. డబలు రోడ్డెప్పుడేశారు? ఏం డెవలప్మెంటు?' అని ఆశ్చర్యపోయి, కళ్ళు పెద్దవి చేసి చూశారు మళ్ళీ. బామ్మర్దిగారికి రెండు రోడ్లూ స్పష్టంగా కనిపించాయి. అలా చూస్తుండగా తాను ఎక్కడున్నదీ, ఎందుకున్నదీ మరిచిపోయారు.

'ఇప్పుడు మనం ఎక్కడున్నాం? ఎందుకున్నాం?' అని బుర్రని ప్రశ్నించారు.

బుర్ర ఓసారి గోక్కుని నాకు తెలీదని అడ్డంగా తలూపింది. ఆ ఊపుకి ఓ సారి తూలి, మళ్ళీ నిలదొక్కుకుని కళ్ళు తెరిచారు బామ్మర్దిగారు. ఎదురుగా 'డబలు గేటు' కనిపించింది.

'ఇదేంటి? ఇటలాచార్యగాడి పిచ్చర్లా ఉంది? కళ్ళు మూసి తెరిచేటప్పటికి రోడ్డు మాయమై గేటొచ్చింది?' అని ఆశ్చర్యపోయి, 'రోడ్డేమైంది?' అని బుర్రని ప్రశ్నించారు మళ్ళీ.

బుర్ర మళ్ళీ గోక్కుంది. బామ్మర్దిగారు మళ్ళీ తూలారు. డబలు గేటు మాయమై డబలు రోడ్డుమీద డబలు రిక్షాలు ప్రత్యక్షమయ్యాయి. రిక్షా చూడగానే బుర్రకి విషయం గుర్తుకొచ్చింది.

'మనం వేటకి బయల్దేరాం' అంది.

'మరైతే రిక్షా కావాలి కదా' అన్నారు బామ్మర్దిగారు.

'కావాలి కదా! పిలు' అంది బుర్ర.

'ఒరే రిక్షా! ఇట్రా!' అని పిలిచారు బామ్మర్దిగారు. రెండు రోడ్లమీద రెండు రిక్షాలు బామ్మర్దిగారికేసి తిరిగాయి.

'ఒకటి సాలురా! నువ్వెళ్లిపో' అన్నారు ఓ రిక్షావాడితో. రెండు రిక్షాలు మళ్ళీ రోడ్డువైపుకి తిరిగాయి.

'నువ్వుండ్రా'

రిక్షా చోదకుడు రిక్షా వెనక్కు మళ్ళించి - తెల్లపైజమా, తెల్ల లాల్చీలో తిండి ఎక్కువై, పని తక్కువై, ఆంబోతులా బలిసిన బామ్మర్దిగారి కేసి నిరసనగా చూస్తూ, ఆయన చుట్టూ మూడు రౌండ్లేసి, ఎదురుగా ఆపి, కుడికాలు పెడలు మీంచి తీసి హాండిలు బారు మీద వేసి, మెళ్ళో ఎర్ర రుమాలు కొంచెం బిగించి - 'ఏంటి పెట్టీ బూర్జువా?' అన్నాడు, 'రా', 'రా' అంటున్న బామ్మర్దిగారి వ్యవహారం ఏమిటో తేల్చడానికి సంసిద్ధుడవుతూ.

బామ్మర్దిగారికి కన్నూ, మెదడూ సరిగా పనిచేస్తుంటే రిక్షా మీద 'విప్లవరథం' అనే ఎర్ర అక్షరాలూ, రిక్షా చోదకుడి మెళ్ళో ఎర్ర రుమాలూ కనిపించి, అతను పట్టణ రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు ఎర్రరుమాలు ఎర్రన్న అని అర్థమయ్యేది. ఆయనకి 'ఆరవ ఇంద్రియం' కనుక ఉంటే, ఎ. ఎర్రన్న విజయవాడలో ఆంధ్రా రిక్షా కార్మిక సంఘం వార్షిక మహాసభలకు వెళ్ళి, బూర్జువా పాసింజర్లు రిక్షా కార్మికుల రక్తం ఎలా తాగేస్తున్నదీ, రాష్ట్రనాయకుల నిప్పు మార్కు ఉపన్యాసాల ద్వారా తెలుసుకుని, ప్రభావితుడై, నిన్ననే తిరిగి వచ్చాడని తెలిసేది. ఆరవ ఇంద్రియం కొంచెం చురుగ్గా పనిచేస్తే, ఎ. ఎర్రన్న 'ఎర్రమల్లెలు' మాట్నీ, మొదటాట, రెండో ఆట, వరసగా మూడాటలూ చూసి, 'తిరగబడర అన్నా! నువ్వూ తిరగబడర అన్నా' అని విప్లవశంఖం పూరిస్తూ వస్తున్నాడని కూడా తెలిసేది.

బుర్ర పని చెయ్యడంలేదు కాబట్టి ఆంబోతు ఎర్రరుమాలుకు బెదరలేదు - 'ఏంటంటన్నావురా?' అంది మళ్ళా 'ర'కారం ప్రయోగిస్తూ.

'పెట్టీ బూర్జువా అంటన్నాను' అన్నాడు ఎర్రన్న ఎర్రగా.

'పెట్టీ లేదు, గిట్టీలేదు. సింగిలే' అని బామ్మర్దిగారు రిక్షా ఎక్కబోతుండగా ఆయన మెళ్ళో బంగారు గొలుసు లైటు వెలుతురులో తళుక్కుమంది.

'ఈడు పెట్టీ బూర్జువా కాదు – ప్రెజల నెత్తురు తాగే సిసలైన బూర్జువాయే' అని నిర్ణయానికొచ్చి, ఎర్రరుమాలు ఇంకొంచెం బిగించి – 'ఎక్కడికెళ్లాలి బూర్జువా?' అనడిగాడు ఎ. ఎర్రన్న.

'మళ్ళీ ఏంటన్నావ్?'

'బూర్జువా అంటన్నాను'

'అంటే ఏంటి?'

అంటే ఏమిటో ఎర్రరుమాలు ఎర్రన్నకీ తెలియదు. 'ఈసారి విజయవాడెల్లినప్పుడు మిరపకాయల రావుగార్ని అడగాలి' అని మనసులోనే నోటు చేసుకుని, పైకి మాత్రం సందేహాలు ఏవీ లేనివాడిలా – 'బూర్జువా అంటే బూర్జువాయే బూర్జువా' అన్నాడు నిక్కచ్చిగా.

'ఈడు మనల్ని తిడతన్నాడా ఏంటి?' అని కొంచెం ఆలోచించి – 'ఏటకెల్లినప్పుడు అర్జునుడిలా ఏకాగ్రతతో ఉండాలి. మన పని మనం చూసుకోవాలి గాని, ఈడితో మనకేంటి?' అనుకుని, విప్లవరథం ఎక్కి – 'పోనీరా' అన్నారు, బూర్జువాలకి విప్లవరథాలు ఎలక్ట్రిక్ ఛైర్లవంటివని తెలియని బామ్మర్దిగారు.

'ఎక్కడికి?' అన్నాడు ఎ. ఎర్రన్న, మళ్ళా 'ర'కారం వినబడడంతో ఎర్రరుమాలు మరికొంచెం బిగించి.

'నీకు తెలీదేంట్రా? ఇదిగో, దారిలో ఆపుచేసి....' అంటూ జేబులు తడుముకున్నారు బామ్మర్దిగారు. జేబులో డబ్బులు కనిపించలేదు.

'మనం పేకాట్లో డబ్బులు గెల్చాం కదా! జేబు ఖాళీగా ఉందేంటి?' అని కాసేపు తికమకపడి, తరువాత లాల్చికింద బనీనులో డబ్బు దాచిన విషయం గుర్తుకొచ్చి, బనీనులోంచి ఓ నోటు బయటకు లాగి – '..... దారిలో ఆపుజేసి ఈ రూపాయెట్టి మల్లెపూలు కొని పట్రా' అన్నారు ఎర్రన్న కేసి తిరిగి.

ఎర్రన్న మొహం కందగడ్డలా ఎర్రగా అయిపోయింది. ఫైనల్‌గా ఎర్రరుమాలు బిగించి – 'నేను డాఫరు నాకొడుకుననుకుంటున్నావేంట్రా బూర్జువా నా కొడకా....' అని విప్లవించబోతుండగా బామ్మర్దిగారి చేతిలో వంద రూపాయల నోటు కనిపించింది ఎర్రన్నకి. పచ్చనోటు కంటబడగానే విప్లవాగ్నిని నివురు కప్పేసింది.

'ఈడ్ని మనం తంతే ఈడు ఆస్పిటలుకో, స్మశానికో పోతాడు. మనం జెయిలుకి పోతాం. నోటు పోలీసోడి జేబులోకి పోద్ది. బూర్జువా నాకొడుక్కి నిషాలో రూపాయి

నోటుకీ, వంద నోటుకీ తేడా తెలీడంలేదు. చుప్ చాప్‌గా అది మనం జేబులోకి తోస్తే బెటరు' అనుకుని మాట్లాడకుండా నోటు అందుకుని, చొక్కా జేబులోకి తోసేసి, విప్లవరథం లాగడం మొదలుపెట్టాడు ఎర్రన్న.

దారిలో మల్లెపూలు కొని, రెండు దండలు బామ్మర్దిగారికిచ్చి, రెండు దండలు హేండిల్ బారుమీద పడేసి – 'ఐక్లాసేనా బూర్జువా?' అనడిగాడు ఎర్రన్న రథాన్ని మెల్లిగా పోనిస్తూ.

'రిక్షా అపరా'

ఎర్రన్న రిక్షా ఆపబోతుంటే – 'ఇక్కడ కాదెహ – అక్కడ – లైటుకింద' అనరిచి, 'నాకేసి చూడ్రా' – మెళ్ళో బంగారు గొలుసూ, మల్లెపువ్వులాంటి లాల్చీ, పైజమా చూపిస్తూ, ఛాతీ పొంగించి అడిగారు బామ్మర్దిగారు – 'నేను లోక్లాసులా కనిపిస్తున్నా నేంట్రా ఎదవా?'

అడ్డూ ఆపూలేని బామ్మర్దిగారి నోటికి ఎర్రగుండె ఓసారి భగ్గుమంది. ఫుట్‌బాల్ ఛాంపియన్‌ని బంతి తన్ననివ్వకుండా కూర్చోబెట్టేస్తే ఎలా గిలగిలలాడుతాడో అలా గిలగిలలాడేడు ఎర్రన్న– గుండ్రంగా, బంతిలా ఉన్న బామ్మర్దిగారికేసి ఓరకంట చూస్తూ, 'ఈణ్ణి తన్ని వొంద రూపాయలు వదులుకోడం అతివాద దుందుడుకు ఇదానం. వొంద రూపాయలకోసం ఈణ్ణి వొదిలెయ్యడం మితవాద అవకాశవోదం. ఏటి మార్గ్గం? అద్దరేత్రేళ నన్నిలా డైనమాలో పడేసేవ్' అని మథనపడుతూ వాటరు టాంకుదాకా రథాన్ని నీరసంగా ఈడ్చుకొచ్చాడు ఎర్రన్న. వాటరు టాంకుకి కొంచెం దూరంలో ట్యూబ్ లైట్లు వెలుగుతున్న మేడ కనిపించగానే ఎర్రన్న బుర్రలో లైటు వెలిగింది.

'దిగు బూర్జువా' అన్నాడు విప్లవరథానికి హఠాత్తుగా బ్రేకు వేసి.

'ఇక్కడే?' అనడిగారు బామ్మర్దిగారు కళ్ళు నులుముకుని.

'ఆ ఇల్లే'

'ట్యూబులైట్లు ఎలుగుతున్నాయేంట్రా?'

'ఇంత యస్పీరియన్సున్నోడివి – ఈ టైంలో ట్యూబ్‌లైట్లు ఎక్కడ ఎలుగుతాయో తెలీదా?'

'రిక్షా పోనీరా'

'అక్కడకి అంతా కార్లలోనే వస్తారు బూర్జువా! రిక్షాలో ఎడితే లోక్లాసులా ఆనుతావు'

'ఆ మాట ముందేడిస్తే మనం కార్లోనే వచ్చేవోళ్ళం గదా'

'ఇప్పుడు కారుకోసం ఎనక్కెడతావేంటి? ఇక్కడ దిగి నడిచెల్లిపో' అని బామ్మర్దిగారిని దింపేసి, జేబులోంచి నోటు ఓసారి తీసి ముద్దుపెట్టుకున్నాడు ఎఱ్ఱన్న. అడగక ఇచ్చిన ముద్దులా, ఒళ్ళొంచకుండా వచ్చిన డబ్బు చాలా తియ్యగా ఉంటుందన్న నిజం తెలిసొచ్చింది ఎఱ్ఱరుమాలు ఎఱ్ఱన్నకి.

హేండిల్ బారుమీద వేసిన మల్లెదండలు తీసి ఓసారి వాసన చూసి, మళ్ళీ హేండిల్ బారు మీద పడేసి, చెవిలోంచి బీడీ తీసి నోట్లో పెట్టి, అగ్గిపెట్టె తీసి అగ్గిపుల్ల వెలిగించగానే, ఎఱ్ఱన్నకి సిల్కుస్మిత గుర్తుకొచ్చింది.

'అరెరే... అగ్గిపుల్ల భగ్గుమంటది... ఆడపిల్ల సిగ్గులంటది' అని పాడుతూ హుషారుగా రిక్షా తొక్కేస్తున్న ఎఱ్ఱరుమాలు ఎఱ్ఱన్న తప్పుదారిన పయనించడం సహించలేకపోయింది విప్లవాంతరాత్మ.

'తిరగబడర అన్న! నువ్వు తిరగబడర అన్న' అంది నీరసంగా ఎఱ్ఱన్న గుండె లోతుల్లోంచి, పచ్చనోటు బరువుకింద అణగిపోతూ.

'ఇయాల్టికొద్దు వొద్దు అన్న! రేపు తిరగబడదమన్న' అని అంతరాత్మ గొంతు నొక్కేసి, సోడాషాపు దగ్గర రథం ఆపుచేసి, రెండు 'స్పెషల్ సోడాలు' పట్టించి – 'ఇయాల సచ్చావు బూర్జువా' అని బామ్మర్దిగార్ని దీవించి, అంతలో సిల్కుస్మిత మళ్ళీ గుర్తుకు రాగా హుషారుగా సీటుమీదకు ఎగిరి, బండి స్టార్టు చేసి యమస్పీడులో ఖాళీ రోడ్డుమీద పాము మెలికలు తిప్పుతూ – 'అరరే... అడ్పిల్ల బగ్గుమంటది.... టట్టడం... అగ్పుల్ల సిగ్గులంటది.... టట్టడం' అని పాడుతూ చీకట్లో కలిసిపోయాడు ఎఱ్ఱరుమాలు ఎఱ్ఱన్న.

ఇక్కడ బామ్మర్దిగారు రిక్షా దిగి తూలుతూ నడిచి గేటు తీసుకుని లోపలకు ప్రవేశించారు. గేటునుంచి పోర్టికోవరకు చప్టాచేసి ఉంది. దారికి రెండు వైపులా పూలకుండీలున్నాయి. హాలులోకి తలుపు కొద్దిగా తెరిచి ఉంది. దానికి ఉన్న కర్టెను ఫానుగాలికి మెల్లగా కదులుతోంది. హాలులో రెండు వైపులా రెండు ట్యూబులైట్లు వెలుగుతున్నాయి.

'ఈళ్ళెవరు? మన రాజ్జెంలో ఈళ్ళున్నట్టు మనకింతవరకూ తెలీదే' అనుకుంటూ కర్టెను తొలగించి లోపలికి నడిచారు బామ్మర్దిగారు.

హాల్లో ఇద్దరు ఆడవాళ్ళు సోఫామీద కూర్చుని ఉన్నారు. ఒక ఆవిడ బంగినపల్లి మామిడిపండులా పచ్చగా, గుండ్రంగా, నున్నగా ఉంది. ఆవిడ ఊలుతో ఏదో

అల్లుతోంది. ఆవిడ పక్కనే ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి పాంటూ, స్లాకూ వేసుకుని ఉంది. ఆ అమ్మాయి సోఫాలో జేర్లపడి సెంట్రల్ టేబుల్ మీద కాళ్ళు పెట్టి ఏదో ఇంగ్లీషు నవల చదువుతోంది. హాలులో ఓ మూల టీవీ, మరో ప్రక్క ఫ్రిజ్ ఉన్నాయి. పెద్ద షోకేసులో రకరకాల బొమ్మలు అందంగా అమర్చి ఉన్నాయి.

'ఐక్లాసే' అనుకున్నారు బామ్మర్దిగారు సంతృప్తిగా, 'మనం కూడా ఐక్లాసుగానే ఉండాల' అనుకుంటూ రెండడుగులు లోపలికి వేసి – 'గుడ్ మార్నింగ్' అన్నారు, చేతిలో మల్లెపూలదండలు ముందుకు చాచి.

అర్ధరాత్రి హఠాత్తుగా సుప్రభాతం వినిపించగానే ఆడవాళ్ళు ఉలిక్కిపడి, తలెత్తి బామ్మర్దిగార్ని చూసి, కొంచెం కంగారుపడి – 'గుడ్ మార్నింగ్' అన్నారు అయోమయంగా.

'ఐ క్లాసోళ్ళ'తో కొంచెం ఇంగ్లీషులోనే మాట్లాడాలనుకుని – 'హియర్ ఐ సిట్టింగు?' అని అడుగుతూ సోఫాలో ఎదురుగా కూర్చుని చిరునవ్వు నవ్వారు బామ్మర్దిగారు. కూర్చున్నాకా నిజంగా ఇద్దరు ఆడవాళ్ళున్నారా, లేక రెండు రిక్షాల్లాగా ఒకళ్ళు ఇద్దరుగా కనిపిస్తున్నారా' అని సందేహం వచ్చి, బొటనవేళ్ళు కింద రెప్పలమీద, చూపుడు వేళ్ళు పై రెప్పలమీదా ఉంచి, రెప్పలు విడదీసి, కళ్ళు పెద్దవి చేసి ముందుకు వంగి మొహంలో మొహం పెట్టి ఇద్దర్నీ పరిశీలనగా చూశారు. ఇద్దరు ఆడవాళ్ళు స్పష్టంగా కనిపించారు.

పాంటు వేసుకున్న అమ్మాయి టేబులు మీంచి కాళ్ళు తీసి చికాగ్గా వెనక్కి జరిగింది. తన్ను చూసి లోక్లాసెదవనుకుంటోందేమోనన్న సందేహం వచ్చి కోపం వచ్చింది బామ్మర్దిగారికి. బనీనులోంచి రెండు గుప్పెళ్ళతోనూ నోట్లు తీసి టేబులు మీద విసురుతూ, 'మన్దీ ఐ క్లాసే' అన్నారు కోపంగా.

కూతురు తల్లికేసి భయంభయంగా చూసింది. 'నేనున్నాను కదా' అన్నట్లు తల్లి కూతురుకేసి చూసింది. ఇద్దరూ హాల్లో గడియారం కేసి చూసి, తలుపుకేసి చూశారు.

'ఇంకెవరికోసం ఎదురు సూడొద్దు. ఇయ్యాల్టికిద్దర్నీ నేనే బుక్ చేసేస్తాను' అన్నారు బామ్మర్దిగారు టేబులు మీద నోట్లు గుట్టగా పోస్తూ.

చిన్నదాని కళ్ళు ఎర్రబడ్డాయి. 'తొందరపడొద్దు' అన్నట్లు తల్లి కూతురుకేసి చూసింది.

'మాట్టాడండి' అన్నారు బామ్మర్దిగారు కొంచెంసేపు ఆగి.

'ఏం మాట్లాడాలి?' అంది తల్లి. ఆవిడ గొంతు కొంచెం బొంగురుగా, ఆర్డర్లు ఇవ్వడమే కాని అందుకోడం అలవాటులేని వాళ్ళ గొంతులా విసురుగా, అధికారంగా ఉంది.

'ఏదో ఒకటి – ఇల్లాంటప్పుడు ఏం మాట్టాడతారో అది'

'ఎవరు నువ్వు?' అంది ఆవిడ తలుపుకేసి చూస్తూనే.

'పేసింజరు పేరెందుకు? నీక్కావాల్సింది నువ్వు తీసుకో' అని నోట్లు ఆవిడవేపు గెంటి – 'నాక్కావాల్సింది నాకియ్యి' అన్నారు అర్థవంతంగా.

కూతురు మళ్ళీ భయంభయంగా తల్లికేసి చూసింది. తల్లి భయం లేదన్నట్లు కూతురు కేసి చూసి ధైర్యం చెప్పింది.

'ఇంకా దీన్ని లైన్లో పెట్టలేదా – అలా బెదురుతోంది' అనుకుని – 'ముందు డ్రింకు.... తర్వాతది తర్వాత' అన్నారు బామ్మర్దిగారు.

తల్లి ఓ క్షణం ఆలోచించి, లేచి విస్కీ, సోడా, ఐసు తీసుకొచ్చింది.

'అంతా రెడీయే! ఎల్లాగైనా ఎక్స్పీరియన్సున్నది. గుమ్మడికాయలా నిండుగా ఉంది. కుర్రదానితో ఏం తంటాలు పడతాం? ఇదవుతేనే బావుంటుంది' అనుకున్నారు బామ్మర్దిగారు, ఆవిడ డ్రింకు కలుపుతుంటే.

డ్రింకు పూర్తి చేసేప్పటికి గడియారం ఒంటిగంట కొట్టింది. కొద్దిగా దిగిన నిషా మళ్ళీ టాపుకి చేరుకుంది. బద్ధకంగా ఆవులించి, లేచి, తూలి నిలదొక్కు కుంటుండగా జీపు ఆగిన చప్పుడైంది. ఆ చప్పుడు బామ్మర్దిగారు గమనించకపోయినా ఆడవాళ్ళిద్దరూ గమనించి 'హమ్మయ్య' అనుకుని నిట్టూర్చారు.

జీపు చప్పుడు వినిపించకపోయినా, హాల్లోకి ఎవరో వస్తున్నట్లు బూట్ల చప్పుడు వినిపించి, కళ్ళు పెద్దవి చేసి చూశారు బామ్మర్దిగారు. ఎదురుగా, అస్పష్టంగా దబలు పోలీసాకారాలు కనిపించాయి. తనొచ్చినందుకే వాళ్ళూ వచ్చారనుకుని చిరునవ్వు నవ్వి – 'గుడ్ మార్నింగ్ సార్! బేడ్లక్ దిస్ టైం.... గుడ్లక్ నెక్సు టైం.... ఈ రాత్రికి మనం బుక్ చేసేశాం' అంటుండగా చిన్నది తేరుకుని – 'డాడీ' అంటూ పరిగెట్టింది.

'ఏమండీ! ఈ రౌడీ వెధవ చూడండి. ఇందాకట్నుంచీ ఇంట్లో కూర్చుని అల్లరి పెడుతున్నాడు' అంది చిన్నదాని తల్లి.

యస్పీ నాయుడిగార్ని అంతా 'పులినాయుడు' అని పిలుస్తారు. ఏడడుగులెత్తు పులిలా ఆయన ప్రసన్నంగా ఉన్నప్పుడే ఎర్రటికళ్ళతో, ఒత్తుమీసాలతో, 'పులిముఖం

లాంటి' ముఖంతో భీకరంగా కనిపిస్తారు. కోటయ్య మంత్రిగారి విజిట్ సందర్భంగా మూడు రోజుల్నుంచీ తిండీ తిప్పలూ సరిగాలేక, నిద్రాహారాలు లేని పులిలా పరమ భయంకరంగా ఉన్నారు ఇప్పుడు.

గుమ్మం దగ్గర నిలబడ్డ నాయుడుగారు టేబులు మీద గుట్టగా పడి ఉన్న నోట్లూ, విస్కీ సీసా, మల్లెపూలూ, అన్నీ చూశారు. ఆయనకి ఆవేశంతో నోట మాట రాలేదు. మూడు రోజులు నిద్రాహారాలు లేని పులి గుహకి చేరుకోగానే తన పెళ్ళాంతో సరసాలాడుతున్న నక్కని చూసి ఎలా గుర్రుమంటుందో అలా గుర్రుమన్నారు నాయుడు గారు. అలా గుర్రుమని, బెల్టు విప్పుతూ పక్కన నిలబడ్డ జవానుకేసి చూశారు.

జవాను కొత్తగా ట్రెయినింగై సమరోత్సాహంతో ఉన్న బాలచంద్రుడు. నాయుడుగారు గుర్రుమనగానే అతనికి అంతా అర్థమైపోయి, మొట్టమొదటిసారి ఎస్పీగారి సమక్షంలో లాఠీ ప్రయోగించే అవకాశం వచ్చినందుకు దేవుడికి మనసారా ధన్యవాదాలు చెప్పుకుంటూ లాఠీ ఎత్తాడు.

హాలు మధ్య సారా పీపాలా తొణక్కుండా, బెణక్కుండా నిలబడ్డ బామ్మర్దిగారికి, చిన్నది 'డాడీ' అంటూ పోలీసాకారం దగ్గరకి పరిగెట్టడం, పెద్దది ఏదో అనడం అన్నీ వినబడ్డాయి కాని, సారాలో ఊరేసిన ఆయన  మెదడుకి సారాంశం బోధపడలేదు.

నాయుడుగారు బెల్టు విప్పుతుంటే మరోందుకనుకుని, ముక్కుమీద వేలేసి – 'ష్.... ష్..... చు.... చు.... చు... తప్పు..... ఈ నైటు మంది గురూగారూ' అని తల్లికేసి తిరిగి – 'బెడ్రూం ఎటు డియరూ?' అంటుంటే నేల కదిలినట్లై వీపు చుర్రుమంది.

'ఇదేంటి? బూకంపం వచ్చి నేలూగితే మనీపు మండుతోంది' అని ఆశ్చర్యపోయారు బామ్మర్దిగారు. రెండో దెబ్బ పడేసరికి విషయం బోధపడి ఆయన గుండె భగ్గుమంది – 'నా మీద చెయ్యిజేసుకోడానికి ఈడికెన్ని గుండెలు? ఆర్డినరీ ఎదవననుకుంటున్నాడేమో? ఐక్లాసోణ్ణి – కోటయ్యగారి బామ్మర్దిగారినని ఈడికి తెలియదు కాబోలు' అనుకుని, తనెవరో తెలియజెప్పడానికి నోరు తెరవబోతుండగా లాఠీ మూతిని ముద్దుపెట్టుకుని మూడు పళ్ళూడగొట్టింది.

లాఠీ ప్రతాపం చూపించగానే బెల్టుకి చిన్నతనం అనిపించి శీర్షాసనం వేసి ఇత్తడి బకులుతో ఇంకో పన్నూడగొట్టింది.

'పళ్ళునావి! నువ్వు కలగజేసుకోకు' అంది లాఠీ అడ్డుపడి.

'అయితే చర్మం నాది' అంది బెల్టు.

'ఎముకలు, కీళ్ళునావి' అంది లారీ.

ఆస్తి పంపకాలైపోయిన తర్వాత – 'వీడి కీళ్ళు ఎలా విరుస్తానో చూడు' అంది లారీ గర్వంగా.

'నువ్వెప్పుడైనా చాకలాడు బట్టలుతకడం చూశావా?' అంది బెల్టు వేళాకోళంగా.

'చూళ్ళేదు'

'ఇప్పుడు చూడు' అని ష్.... ష్.... అని ఉతకడం మొదలుపెట్టింది బెల్టు.

'ఓస్... ఉతకడం అంటే ఇదా? ఇంకేవిటో అనుకున్నాను' అని నిరసనగా నవ్వి – 'నువ్వు పరుపు దులపడం చూళ్ళేదనుకుంటాను' అంది లారీ.

'ఎలా దులుపుతారు?'

'ఇలా' అని దబదబా బాదడం మొదలుపెట్టింది లారీ.

లారీ, బెల్టూ పోటాపోటీగా దుమ్ము దులిపి, ఉతికి, కీళ్ళు విరిచి, చర్మం ఒలుస్తుంటే, సరదాపడి రెండు జతల బూట్లు కూడా ఫీల్డులోకి దిగి బామ్మర్దిగారితో ఫుట్‌బాల్ ఆడడం మొదలుపెట్టాయి హుషారుగా. ఆట పూర్తయ్యేసరికి బామ్మర్దిగారు మాటలేని మూటలా మిగిలారు.

✧ ✧ ✧

'ఏంట్రా బామ్మర్దీ! ఏవైందీ' అని అడుగుతూ హాస్పిటలు గదిలో ప్రవేశించిన కోటయ్య మంత్రిగారు ఎవరూ కనిపించక – 'ఏడీడు?' అని ఆశ్చర్యపోయారు.

తెల్లవారగట్ల కాలవ ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్ళిన పౌరులకి మునిసిపాలిటీ చెత్తకుండీ పక్కన, రెండు పందుల మధ్య స్పృహ లేకుండా పడి మూలుగుతున్న బామ్మర్దిగారు దర్శన మిచ్చారు. ఎవరో బామ్మర్దిగార్ని గుర్తించి హాస్పిటల్లో చేర్పించి, కోటయ్య మంత్రిగారికి కబురందించగానే ఆయన కారేసుకుని వచ్చేశారు.

'అక్కడ సార్' అన్నారు, కూడా ఉన్న డాక్టరు గారు, ఎదురుగా బెడ్ మీద తల నుంచి కాళ్ళవరకు బేండేజీ గుడ్డతో ఈజిప్షియన్ మమ్మీలా ఉన్న ఓ ఆకారాన్ని చూపిస్తూ. కోటయ్యగారు పరిశీలనగా చూడగా తెల్లటి గాజుగుడ్డలో ఓ ముక్కు నోరు, కన్ను కనిపించాయి.

బావగార్ని చూడగానే 'ఊ.... ఊ.....' అని మూలిగింది మమ్మీ.

'ఏంట్రా బామ్మర్దీ! ఏవైందీ' అన్నారు కోటయ్య గారు బెడ్ మీద కూర్చుంటూ.

'డబలు గేట్లు.... డబలు రోడ్లు.... డబలు రిక్షాలు.... రిక్షా ఎక్కి...'

'ఎవుడాడు? ఆణ్ణి గుర్తు పట్టగలవా?'

బామ్మర్దిగారు తల అడ్డంగా ఊగించబోయి, మెడ పట్టి 'అమ్మో!' అనరిచారు.

'ఆడు.... బు...బు... బూ.... పెట్టి బూ... ఏదో తిట్టాడు. నాకు గుర్తు రాటల్లే... రెండు ఆడోళ్ళు.... రెండు దున్నపోతులు..... రెండు యముళ్ళు....దున్నపోతులు తోకలుచ్చుకు కుమ్మేశాయి.... కాదు.... కాదు.... రెండు మల్లెపూల దండలు.... రెండు పోలీసులు... రెండు పందులు.... నాకేం గుర్తు రాటల్లేదు బావోయ్!' అని మెడ కదపకుండానే జాగ్రత్తగా గొల్లుమన్నారు బామ్మర్దిగారు.

'అన్నీ రెండు రెండు అంటాడేంటి ఈడు? మీకేవైనా అర్థవైందా?' అనడిగారు కోటయ్య మంత్రిగారు బుర్రగోక్కుంటూ, డాక్టరు గారి కేసి తిరిగి.

'డెలీరియం' అన్నారు డాక్టరుగారు – 'ప్రాణానికి ప్రమాదం లేదుగాని, కీలు కీలు సైంటిఫిగ్గా విరగ్గొట్టి, చర్మం ఒలిచేశారు. నా సర్వీసులో ఇంత బ్యూటీఫుల్ కేసు చూడలేదు. ఏం కొట్టారు? ఏం కొట్టారు? ఆహా!' అని కీళ్ళు విరగ్గొట్టిన వాళ్ళ కళా నైపుణ్యాన్ని తన్మయత్వంతో మెచ్చుకున్నారు డాక్టరుగారు.

'ఆడిది గేదెలాంటి ఫిజిక్కు కాబట్టి ఈ దెబ్బలకి తట్టుకున్నాడు గాని, ఇంకోడైతే ఈపాటికి అరడజనుసార్లు సచ్చేవోడు. ఆడు డెలివరీలోంచి బయటపడ్డాక ఏం జరిగిందో కనుక్కోండి' అని డాక్టరుగారికి చెప్పి, బామ్మర్దిగారికేసి తిరిగి – 'ఏం పర్లేదురా బామ్మర్దీ! ఏ పార్టూ మిస్సవకుండా అన్ని పార్టులతోనూ మంచం దిగుతావంట – ఆర్నెల్ల తర్వాత' అని బామ్మర్దిగారికి ధైర్యం చెప్పారు కోటయ్య మంత్రిగారు.

*(ఆంధ్రప్రభ వారపత్రిక, 24 మే, 1989)*